చల్లంగ చూడు గంగమ్మా..



నెమలి పింఛాల అలంకరణలో గంగమ్మతల్లి





అమ్మవారిని దర్శించుకుంటున్న మేయర్ డాక్టర్ శిరీష









● గంగమ్మకు భక్తుల మరుపొంగళ్లతో మొక్కులు

తిరుపతి కల్చరల్: చల్లంగా చూడు గంగమ్మ తల్లీ... అంటూ భక్తజనం మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించి ప్రణమిల్లి వేడుకున్నారు. తిరుపతి గంగ జాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరుపొంగళ్ల మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గంగ జాతర తర్వాత వచ్చిన నాలుగో మంగళవారం కావడంతో అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. పొంగళ్లు నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం నెమలి పింఛంతో సర్వాంగ సుందర అలంకరణలో గంగమ్మ తల్లిని కొలువుదీర్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతర మొక్కుబడి వేషాలతో ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. మరి కొందరు భక్తులు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకొని ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడిలో భాగంగా భక్తులు ఆలయం వద్ద భక్తులకు అంబళ్లు పోసి, ప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయానికి విచ్చేసి భక్తులకు ఆలయ ఈఓ కె.మమత అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేయించి ప్రసాదాలు వితరణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.







వేయికళ్ల దుత్తలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, రంగస్థలి కళాకారులతో మేయర్ డాక్టర్ శిరీష

క్లుప్తంగా

జగనన్న కాలనీలో మోటార్లు చోరీ

చంద్రగిరి: మండల పరిధిలోని తొండవాడ పంచాయతీ జగనన్న కాలనీలో పలు ఇళ్లలో సోమవారం అర్ధరాత్రి 1హెచ్‌పీ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సుమారు 7 ఇళ్లల్లోని మోటార్లను ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసును విచారిస్తున్నారు.

అమ్మవారి సేవలో దర్శకుడు త్రివిక్రమ్



అమ్మవారిని దర్శించుకున్న త్రివిక్రమ్

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అధికారుల స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకొని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల ఆయనతో ఫొటోలు దిగడానికి భక్తులు పోటీ పడ్డారు.

న్యాయవాది మృతికి సంతాపం

తిరుపతి లీగల్: తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న దామోదరశర్మ ఆకస్మిక మృతి సందర్భంగా తిరుపతి న్యాయమూర్తులు, న్యాయవాదులు మంగళవారం ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. స్థానిక మూడో అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్లో న్యాయవాదుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గోపీచంద్, సీనియర్ న్యాయవాదులు కొత్తపల్లి అజయ్‌కుమార్, కేఎస్.వాసు, వజ్రాల చంద్రశేఖర్ తదితరులు దామోదరశర్మ సేవలను కొనియాడుతూ ప్రసంగించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐదో అదనపు జిల్లా జడ్జి రామ్‌గోపాల్, నాలుగో అదనపు జిల్లా జడ్జి అర్చన, పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు, సీనియర్ జూనియర్, సివిల్ జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

బలిజ సేన అధ్యక్షుడిగా చెరుకుల నీలాద్రి



చెరుకుల నీలాద్రి

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా బలిజ సేన అధ్యక్షుడిగా చెరుకుల నీలాద్రిని నియమించామని బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చెరుకుల నీలాద్రి మాట్లాడుతూ జిల్లాలోని బలిజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

భాకరాపేట: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట హైస్కూల్, ఎర్రావారిపాళెం మండలం మోడల్ స్కూల్‌లో స్టూడెంట్స్ కిట్ బ్యాగులు పంపిణీ చేశారు. భాకరాపేట హైస్కూల్‌లో బాలికల జూనియర్ కళాశాలకు భవనాలు కావాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. రెండు మూడు నెలల్లో అదనపు తరగతి గదులు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. తిరుపతి ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, ఎంఈఓలు సత్యనారాయణ, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. పాకాల మండలంలో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.

నేడు ప్రదోష పూజలు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లెలోని శ్రీ సర్వ మంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రా రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ప్రదోష మండపంలో నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామి, మరకదాంబిక అమ్మవారికి ఏక కాలంలో విశేష అలంకారాలు, అభిషేకాలు, మహాహారతి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ప్రదోష పూజలో పాల్గొనదలచిన వారు రూ.500 చెల్లించి రసీదు పొందాలని తెలిపారు.

పోలినాంచారమ్మ ఆలయంలో పొంగళ్లు



విశేషాలంకరణలో పోలినాంచారమ్మ

ఏర్పేడు: మండలంలోని కోబాక పోలినాంచారమ్మ ఆలయంలో మంగళవారం ఘనంగా పొంగళ్లు నిర్వహించారు. ఆలయ పూజారి అమ్మవారి విగ్రహానికి వివిధ రకాల అభిషేకాలతో పూజలు చేశారు. అంజిమేడు గ్రామానికి చెందిన మహిళలు అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లుపెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏడాది గ్రామస్తులు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది.

గో హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న భజరంగదళ్ జిల్లా కన్వీనర్ కిరీటిరెడ్డి

తిరుపతి కల్చరల్: దైవంగా భావించే గోవులను అక్రమంగా తరలిస్తూ వధించే గో హంతకులపై కఠిన చర్యలు తీసుకోవాలని భజరంగదళ్ జిల్లా కన్వీనర్ కిరీటిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి నిత్యం గోవధ జరుగుతోందని, ఇలాంటి చర్యలను అడ్డుకోవాలని వినతి పత్రాలు సమర్పించినా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. అక్రమ గో రవాణాను అడ్డుకోవాల్సిన రవాణా శాఖ, అక్రమ వధ శాలలను మూసి వేయాల్సిన పురపాలక శాఖ, పశు సంవర్ధక శాఖ తగిన రీతిలో చర్యలు చేపట్టక పోవడంతో మరింత మితిమీరుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు గోవధను నిషేధించేలా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే రోజుల్లో గోవధ జరగకుండా ప్రత్యక్ష ఉద్యమాలు చేస్తామని తెలియజేశారు. విశ్వ హిందూ పరిషత్ భజరంగదళ్ ప్రతినిధులు రాజీవ్‌రెడ్డి, చంటి, రామకృష్ణ, వాసు, పురుషోత్తం, రమాదేవి, విజయలక్ష్మి, శ్రీనివాసన్, విష్ణుప్రతీక్ రెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షించండి... చదివించండి



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

పాకాల: మండలంలోని మొగరాల పంచాయతీలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఐసీడీఎస్ చంద్రగిరి ప్రాజెక్టు, దామలచెరువు సెక్టార్ ఆధ్వర్యంలో మొగరాల జడ్పీ హైస్కూల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోని ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లల్ని చదివించండి అంటూ పిలుపునిచ్చారు. సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల ద్వారా ఆడపిల్లల అభివృద్ధి సాధిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు షమీం, మోహన, కిషోర బాలికలు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో లక్ష్మీ నరసింహస్వామి

నారాయణవనం: మండలంలో సింగిరికోనలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలను, హోమాలను నిర్వహించారు. నరసింహస్వామి జన్మ నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం ఉదయం 10 గంటలకు శ్రీదేవీ, భూదేవీ సమేత లక్ష్మీ నరసింహస్వామి మూలవరులకు అభి షేకాలను నిర్వహించారు. వెండి కవచాలు, సుగంధ పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో గణపతి, నవగ్రహ, సుదర్శన, ధన్వంతరి, మహా విష్ణు హోమాలను ఆగమోక్తంగా నిర్వహించి పూర్ణాహుతిని సమర్పించారు. పాల్గొన్న భక్తులకు వస్త్ర బహుమానంతో పాటు తీర్థ ప్రసాదాలను ట్రస్టీ సభ్యుడు గిరిబాబు, భాస్కర్‌బాబు అందజేశారు. అలాగే అన్నదాన సత్రంలో అన్నప్రసాదాలను అందజేశారు. గిరిబాబు మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి రోజున ఉభయ నాంచారులతో లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆలయానికి వచ్చే భక్తులకు మూడు పూటలా అన్న ప్రసాదాలను నిత్యాన్నదాన సత్రంలో వితరణ చేస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో భాకరాపేట ముత్యాలమ్మ

భాకరాపేట: శ్రీముత్యాలమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం వేకువ జామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పూజలు ప్రారంభించారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామంలోని మహిళలు భక్తితో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున గ్రామంలో బంధువులు, స్నేహితులు జాతరకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

తోతాపురి మామిడి కిలో రూ.30కే కొనాలి



మామిడి మండీ యజమానులతో మాట్లాడుతున్న శైలజ

పాకాల: తోతాపురి రకం మామిడికాయలు 1 కిలోకు 30 రూపాయలు చెల్లించాలని ఉద్యానవన శాఖ అధికారి ఎస్.శైలజ తెలిపారు. మంగళవారం దామలచెరువులోని మామిడి ర్యాంపులను, మామిడి మండీలను ఆమె సందర్శించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరు పతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తోతా పురి రకానికి టన్నుకు రూ.30 వేలకు తగ్గకుండా రైతులకు చెల్లించాలని తెలియజేశారు. లేకుంటే ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన సహాయకురాలు దేవకి తదితరులు పాల్గొన్నారు.

మైమరిపించిన మరువాడ గానామృతం



భక్తి సంకీర్తనలు గానం చేస్తున్న మరువాడ భీమశంకర్

తిరుపతి కల్చరల్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో మంగళవారం సాయంత్రం అమెరికాకు చెందిన మరువాడ భీమశంకర్ సంగీత గానామృతం శ్రోతలను మైమరిపించింది. ఎస్వీ సంగీత, నృత్య కళాశాలలో సంగీతాన్ని అభ్యసించిన భీమశంకర్ అమెరికాలో ఉద్యోగం చేస్తూ సంగీత వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నారు. ఈయన సంగీతానికి సంబంధించి అనేక వ్యాసాలు, విశ్లేషణాత్మక సదస్సులు నిర్వహించారు. ఇటీవల ఆయన హంసధ్వని పేరిట ప్రత్యేక పుస్తకాన్ని కూడా రాశారు. గాత్ర కచేరీలో భాగంగా వివిధ కీర్తనలు ఆలపించి భక్తుల ప్రశంసలు అందుకున్నారు. వీరికి వయోలిన్‌పై టి.జగదీశ్వరరావు, మృదంగంపై ఎం.మధుసూదన్ వాయిద్య సహకారం అందించారు.

అన్నా క్యాంటీన్లు పరిశీలన



అన్నా క్యాంటీన్లను పరిశీలిస్తున్న కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో నిర్వహణలో ఉండి మూతబడిన అన్నా క్యాంటీన్లను మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ పరిశీలించారు. ముఖ్యంగా తిరుపతి నగరంలో ఎంఆర్ పల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట, ఈఎస్ఐ ఆసుపత్రి ఎదుట, న్యూ బాలాజీ కాలనీలో, స్విమ్స్ సర్కిల్ వద్ద గతంలో ఏర్పాటు చేసి, తర్వాత ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించిన అన్నా క్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. అనంతరం డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించి ఎప్పటికప్పుడు కాలువల్లో చెత్తను తొలగించాలని, కాలువల్లో చెత్త వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలన్నారు. తిరుపతి పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు రోజూ చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి తమ సిబ్బందికి అందజేయాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీఈ మహేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

ఆద్యంతం ఆధ్యాత్మికం





హరికథ గానం చేస్తున్న ప్రముఖ భాగవత కళాకారులు





సప్తాహంలో కళాకారుల హరికథా గానం

తిరుపతి కల్చరల్: వేమన విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియంలో మంగళవారం ప్రముఖ భాగవత కళాకారులు ప్రదర్శించిన హరికథా గానామృతం ఆద్యంతం ఆధ్యాత్మికతతో ప్రేక్షకుల హృదయాలను పులకింపజేసింది. మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో చేపడుతున్న నిరంతరాయ సప్తగిరి సంగీత సప్తాహం మంగళవారంతో మూడో రోజుకు చేరుకుంది. సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ భాగవత హరికథా కళాకారులు రామాయణ, భారత ఇతిహాసాలలోని పలు ఘట్టాలను చక్కటి అభినయంతో గానం చేసి శ్రోతలను మైమరిపించారు. ఉదయం 9 గంటలకు హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణ దాస విరచిత కీర్తనలు గోష్ఠి గానం చేశారు. అనంతరం హరికథా కళాకారులు మండూరి లక్ష్మీకుమారి శ్రీనివాస చరిత్ర, లక్ష్మీరాజ్యం బృందం జానకీ శపథం, యండమూరి శిఖామణి భక్త ప్రహ్లాద, తాడేపల్లె గూడెంకు చెందిన కావూరి శారద సీతాకల్యాణం వంటి అద్భుత ఘట్టాలను సందర్భానుచితంగా రాగయుక్తంగా హరికథా గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు. వీరితో పాటు గుంటూరుకు చెందిన ధూళిపాళ్ల శివరామకృష్ణ శర్మ, గుంటూరుకు చెందిన వెంకట సింహాచల శాస్త్రి, హైదరాబాద్‌కు చెందిన శ్రీరాం భట్టర్, తెనాలికి చెందిన గాలి శివపార్వతి తదితర 20 మంది హరికథా కళాకారులు ఇతిహాస పురాణాలలోని వైవిధ్య భరితమైన ఘట్టాలను వినసొంపుగా గానం చేశారు. మూడో రోజు హరికథ గానం చేసిన కళాకారుల బృందాలను నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గంగులప్ప శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. సప్తగిరి సంగీత సప్తాహంలో భాగంగా నాలుగో రోజైన బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు ప్రముఖ సంగీత విద్వాంసులతో దాస సాహిత్య స్వర ధార కార్యక్రమం నిర్వహించారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో కూడిన విద్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి

రామచంద్రాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు పౌష్టికాహారం కూడా లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అన్నారు. మంగళవారం మండలంలోని రాయలచెరువులో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణ కొరకు పౌష్టికాహార పదార్థాలను అందిస్తున్నట్లు తెలిపారు. 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.